సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 26-2-2025
సంపుటి: 20 సంచిక: 284
పేజీలు: 8 వెల: రూ.1

## కైలాశేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

కిష్టప్పపేట గ్రామంలో వెలసిన పార్వతి సమేత కైలాశేశ్వర స్వామివారికి ఆలయ వ్యవస్థాపకులు ధర్మకర్త గొండు జగన్నాధరావు దంపతులు, శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో శంకర్ స్వయంగా వడ్డించారు. అనంతరం పెదపాడులో వెలసిన శ్రీ మృత్యుంజయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మహాశివరాత్రి గొప్ప పర్వదినమని, స్వామివారిని దర్శించుకున్న వారికి సకల శుభాలు కలుగుతాయని అన్నారు. జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయని, తెలుగువారి గొప్ప పండుగ ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ మహాశివరాత్రి పాటిస్తారని తెలిపారు.

# 'రాజ'కీయం.. 'స్థాని'కుల్ని తినేస్తుంది..!

- మొబైల్ స్పేర్స్‌లో గుత్తాధిపత్యం
- రిపేర్ షాపులు తామే పెడతామంటూ వార్నింగ్‌లు
- అసోసియేషన్ నిబంధనలు పాటించమంటూ హూంకరింపులు
- హోల్‌సేలర్లు, మెకానిక్‌లకు మధ్య యుద్ధం



ఇటీవల ఏడురోడ్ల జంక్షన్‌లో సమావేశమైన సెల్ మెకానిక్‌లు

**ఈస్టిండియా కంపెనీ పేరుతో భారతదేశంలో అడుగుపెట్టి, ఆ తర్వాత మనలో మనకు చిచ్చుపెట్టి విభజించు - పాలించు పేరుతో భారతదేశాన్ని ఆక్రమించుకున్న బ్రిటీషర్ల కోసం మనం చదువుకున్నాం. ఇప్పుడు మన జిల్లాలో కూడా వ్యాపారం పేరుతో వచ్చిన రాజస్థానీలు ప్రధానమైన వ్యాపారాల్లో పాగా వేయడమే కాకుండా స్థానికంగా ఉన్న చిరువ్యాపారుల మధ్య విభజించు-విక్రయించు పేరుతో దందా చేస్తున్నారు. గత రెండు నెలలుగా మొబైల్ ఫోన్ స్పేర్స్ హోల్‌సేల్‌గా విక్రయించే రాజస్థానీ వ్యాపారులకు, స్థానికంగా ఉన్న మొబైల్ టెక్నీషియన్లకు మధ్య పెద్ద యుద్ధమే నడుస్తుంది. చివరకు ఒకరిని మరొకరు బాయ్‌కట్ చేసుకునే పరిస్థితికి దిగజారిపోయింది.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ముంబయి నుంచి విజయవాడ మీదుగా మొబైల్ యాక్సరీస్, స్పేర్స్ తీసుకువచ్చే రాజస్థానీ వ్యాపారులు కొద్ది సంవత్సరాల క్రితం ఇక్కడ వ్యాపారం ప్రారంభించారు. ముంబయిలో కూడా ఈ రాష్ట్రానికే చెందిన తయారీదారులు, సూపర్ హోల్‌సేలర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఉండటంతో వీరికి విరివిగా క్రెడిట్ దొరికేది. దీంతో రాజస్థాన్ నుంచి శ్రీకాకుళానికి మకాం మార్చి గత కొన్నేళ్లు ఏకచత్రాధిపత్యంగా వ్యాపారం చేస్తున్నారు. వీరి దగ్గర్నుంచి జిల్లాలో 1000 మంది మొబైల్ మెకానిక్ షాపుల వారు స్పేర్లు కొనుగోలు చేస్తూవస్తున్నారు. జిల్లా మొబైల్ మెకానిక్ యూనియన్ నిబంధనల ప్రకారం కేవలం గుర్తింపు కార్డులు ఉన్న షాపుల యాజమాన్యాలకు మాత్రమే హోల్‌సేల్ వ్యాపారులుగా వ్యవహరిస్తున్నవారు స్పేర్లు, యాక్సెసరీస్ విక్రయించాలని, రిటైల్‌గా వర్తకం చేసుకునేవారు రిటైల్ ధరకు వాటిని అమ్మాలని ఒక అగ్రిమెంట్ రాసుకున్నారు. అయితే కొద్ది నెలల క్రితం దీనిని రాజస్థాన్ హోల్‌సేల్ వ్యాపారులు మీరారు. జిల్లాలో వెయ్యి మంది గుర్తింపు ఉన్న మొబైల్ మెకానిక్ షాపులకు మాత్రమే కాకుండా నేరుగా హోల్‌సేల్ షాప్ కస్టమర్ వెళ్లినా కూడా ఒకటీ అరా సామాన్లు మొబైల్ షాపులకు విక్రయించిన ధరకే ఇచ్చేస్తున్నారు. దీంతో గత కొన్నాళ్లుగా వేలాది రూపాయల సరుకును ఈ రాజస్థానీ వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి, అవి అమ్ముడుపోక ఇప్పుడు మొబైల్ మెకానిక్ అసోసియేషన్ రోడ్డెక్కింది. తమ వద్ద రూ.100కు అమ్మే స్క్రీన్‌గార్డ్‌తో పాటు అనేక మొబైల్ పార్ట్‌లను రాజస్థానీ వర్తకులు రిటైల్‌గా కూడా అమ్మడం వల్ల తమ వ్యాపారాలు పూర్తిగా కుదేలైపోయాయని, కొన్ని యాక్సెసరీస్ మోడల్స్ ఔట్‌డేటెడ్ కావడం వల్ల వాటిని చెత్తలో పడేయాల్సి వస్తోందని వీరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఎన్నోసార్లు హోల్‌సేల్ వర్తకులకు నిబంధనలు మీరారని అపరాధ రుసుము కూడా మొబైల్ మెకానిక్‌ల యూనియన్ విధించింది. దీంతో జిల్లాలో ఉన్న ఏడు రాజస్థానీ మొబైల్ హోల్‌సేలర్లు ఏకంగా జిల్లాలోని 1000 మంది మొబైల్ మెకానిక్‌లను కరివేపాకులా తీసిపారేశారు. తాము దేశంలో చాలామంది రాజకీయ నాయకులకు ఫండింగ్ ఇస్తున్నామని, తమతో పెట్టుకుంటే వ్యాపారాలు చేయలేరంటూ ఏకంగా రిటైల్ షాపుల పక్కనే మొబైల్ రిపేర్ సెంటర్లను కూడా తెరవడానికి సిద్ధపడిపోయింది. నగరంలో ఉన్న ఏడుగురు హోల్‌సేలర్లు జిల్లా మొత్తం మొబైల్ రిపేర్ సెంటర్లను తెరిచి తమ వద్ద ఉన్న సరుకును మార్కెట్ చేసుకోవాలని ప్రయత్నిస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గం కోసం రాజాంకు చెందిన ఒక వర్తకుడి వద్ద జిల్లా మొత్తం మొబైల్ మెకానిక్‌లు స్పేర్లు, యాక్సెసరీస్ కొనుగోలు చేయాలని నిర్ణయించారు. రాజస్థానీలు ఇస్తున్న రేటుకు, రాజాంలో ప్రస్తుతం సరఫరా చేస్తామని ఒప్పందం కుదుర్చుకున్న రేటుకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో ఇన్నాళ్లూ రాజస్థానీ హోల్‌సేలర్లు తమను అడ్డంగా దోచుకున్నారని గ్రహించిన మొబైల్ మెకానిక్‌లు ముంబయిలో అమ్మిన రేటు మీద రూ.20 లేదా రూ.30 అదనంగా వేసి తమకు విక్రయించే విధంగా రాజాం వ్యాపారితో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో స్థానిక రాజస్థానీలు జిల్లాలో మెకానిక్‌లకు ఎటువంటి సహకారం

- మిగతా చివరి పేజీలో



రామకృష్ణ థియేటర్ సందులో రూ.3 కోట్లు విలువైన మొబైల్ పార్ట్స్ అమ్మే యజమాని ఇల్లు

# విశ్వ మానవాళి సంక్షేమానికి సైన్స్



**1930**లోనే కేవలం రూ.200 విలువ చేసే పరికరాలతో 'రామన్ ఎఫెక్ట్'ను కనుగొని ఆసియా ఖండంలోనే ఫిజిక్స్ విభాగంలో తొలి నోబెల్‌ను భారతదేశానికి చెందిన రత్నం సీవీ రామన్ అందుకున్నారు. అంతేకాకుండా భారతీయ మేధాశక్తిని యావత్ ప్రపంచానికి చాటి చెప్పారు. అవార్డు తీసుకునే సందర్భంలో భావోద్వేగానికి గురైన రామన్ తన దేశానికి స్వాతంత్ర్యం లేదని, తన జాతీయ జెండా ఎగరటం లేదని బాధపడుతూ తనలోని దేశభక్తితో కొన్ని శతాబ్దాలకు స్ఫూర్తి సందేశాన్ని ఇచ్చారు.

1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను భారత రత్న సీవీ రామన్ కనుగొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 1987 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న భారత ప్రభుత్వం జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రకటించి, దేశవ్యాప్తంగా ఎన్నో వినూత్న కార్యక్రమాలతో ఘనంగా వేడుకలు నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా 'ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్‌షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్' అనే థీమ్‌తో సైన్స్ దినోత్సవ వేడుకలు జరుగుతున్నాయి.

### సాంకేతిక అభివృద్ధికి కృషి..

పేదలు, సమాజంలోని అట్టడుగు వర్గాల సమస్యలపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టాలని మహాత్మా గాంధీ ఆశించారు. గాంధీ ఆశయాలకు అనుగుణంగా రామన్ తన యావత్ జీవితాన్ని దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి కోసమే త్యాగం చేశారు. 'రాయల్ సొసైటీ సభ్యుడు కావాలనుకొంటున్నావా?' అని నవ్వులాటగా ఒకరు అడిగినప్పుడు.. ఎందుకు కాకూడదు అనుకొని పట్టుదలతో కూడిన తన పరిశోధనా సామర్థ్యంతో 1924లో రాయల్ సొసైటీ సభ్యుడయ్యారు. ప్రతిక్షణం ప్రకృతి అందాలలో శాస్త్రీయ దృక్పథాన్ని వెతికే రామన్ అన్వేషణలో 'ఆకాశం, సముద్రపు నీరు ఎందుకు నీలంగా ఉన్నాయి?' అన్న ప్రశ్నకు జవాబే కాంతి పరిక్షేపణంకు సంబంధించిన రామన్ ఎఫెక్ట్. పారదర్శకంగా ఉన్న ఘన, ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది దాని స్వభావాన్ని మార్చుకుంటుంది.

### బలమైన ఆయుధంగా రామన్ ఎఫెక్ట్..

లేజర్ కిరణాల రంగప్రవేశంతో శాస్త్రవేత్తలకు రామన్ ఎఫెక్ట్ ఒక బలమైన ఆయుధమైంది. స్పెక్ట్రోస్కోపి అనే విభాగం గొప్పశాస్త్రంగా అధ్యయనం చేయబడుతుంది. నేటికీ రామన్ ఎఫెక్ట్ అనువర్తనాలు ఎన్నో నూతన శాస్త్రీయ ఆవిష్కరణలకు జీవం పోస్తూ, ఆధునిక విజ్ఞానంలో కిరణాలై దూసుకుపోతున్నాయి.

1943లో రామన్ సొంతంగా బెంగళూరులో స్థాపించిన 'రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' నేడు భారతదేశ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఖగోళశాస్త్రం, ఖగోళ భౌతిక శాస్త్రం, ఆప్టిక్స్, థియరిటికల్ ఫిజిక్స్, రసాయన శాస్త్రం, ఫిజిక్స్ ఇన్ బయాలజీ వంటి ఎన్నో విభాగాల్లో పరిశోధనలు జరుగుతున్నాయి. మ్యూజిక్ లవర్‌గా ఉన్న రామన్ పరిశోధనలు ఇప్పటికీ శాస్త్రవేత్తలకు సవాళ్లే. మన దేశ శాస్త్రీయతతో కూడిన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ 'నా మతం సైన్స్. నేను దాన్నే ఆరాధిస్తాను' అన్న రామన్‌ను 1954లో భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో ఘనంగా సన్మానించింది.

### మరో రామన్ ఎఫెక్ట్..!

78 సంవత్సరాల స్వాతంత్ర్య భారత్‌లో మనదేశ పౌరసత్వం నుంచి ఫిజిక్స్‌లో మరో రామన్ ఎఫెక్ట్ రాలేదు. మళ్లీ మనం నోబెల్ గెలవలేదు. గ్రామాలకు సరైన శాస్త్రీయత, సాంకేతికత అందడం లేదు. మూఢనమ్మకాల జాడ ఇంకా మనదేశం నుంచి బయటపడలేదు. అరకొర వసతులతో ఎన్నో సమస్యలు ఉన్నప్పటికీ, ప్రభుత్వాలు పెద్దగా బడ్జెట్ ఇవ్వనప్పటికీ, మన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు కఠోర శ్రమతో కూడిన తమ అంకిత భావంతో చంద్రయాన్, మంగళయాన్ వంటి విజయాలతో ప్రపంచానికి మనమేంటో నిరూపించారు. అయితే, శాస్త్రవేత్తలకు, మేధావులకు భారతదేశంలో సరైన గౌరవం, పరిశోధనా వసతులు లభించక అగ్రదేశాలకు వలస వెళ్తున్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో సైతం విజ్ఞాన శాస్త్ర బోధనలు మార్కుల మాయాజాలంలో బంధీ అయ్యాయి. సంపాదనే ధ్యేయంగా కొందరు అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల నిర్వాహకులు విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చుతున్నారు. యువత కూడా 'తొందరగా సెటిల్' కావాలనే ప్రపంచ పోకడలలో భాగమై సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధనలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయినా ఇప్పటికీ ఎంతోమంది విద్యాసంస్థల నిర్వాహకులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తమ తరగతి గదుల్లో సీవీ రామన్, అబ్దుల్ కలాం వంటి మహానుభావుల ఆశయాలకనుగుణంగా పని చేస్తున్నారు. ఆశావాద దృక్పథంతో అభివృద్ధి భారతం కోసం జీవిస్తున్నారు.


### అభివృద్ధిలో కీలకం సైన్స్ అండ్ టెక్నాలజీ

విజ్ఞాన శాస్త్రాలను బోధించే అధ్యాపకులు వారి బాధ్యతలను విశాలమైన దృక్పథంతో చూడగలగాలి. కేవలం శాస్త్రంలోని సిద్ధాంతాలను, ప్రయోగాలను, ప్రక్రియలను బోధించడమే కాకుండా విద్యార్థులను సామాజిక బాధ్యతలను నెరవేర్చి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే విధంగా తయారు చేయాలి. సైన్స్, సాంకేతికత, సమాజాల మధ్య గల అవినాభావ సంబంధాల గురించి సంక్లిష్టంగా విద్యార్థులు ఆలోచించగలగాలి. విశాల ఆలోచనా విధానం, జాతీయ సమగ్రత, పర్యావరణ స్పృహ, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించాలి. అంతేకాకుండా శాస్త్ర-సాంకేతిక రంగాల్లో మరిన్ని పరిశోధనలను ప్రోత్సహిస్తూ, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు, మానవీయ విలువలను కూడా విద్యార్థుల్లో పెంపొందించే విద్యావిధానం ప్రస్తుతం చాలా అవసరం.

'ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే విజ్ఞానం అత్యుత్తమమైన సృజనాత్మక కళారూపం. ఈ విజ్ఞాన శాస్త్ర సారాంశం ప్రయోగశాల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశ్రమ, స్వతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్రాన్ని మథించి వేస్తాయి' అని సీవీ రామన్ అన్నారు. ఆయన స్ఫూర్తితో మరో అభినవ 'రామన్ ఎఫెక్ట్‌కు' ప్రపంచం ఆశ్చర్యపోవాలని ఆశిస్తూ పేదరికం, అసమానతలు లేని భారత నిర్మాణంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో అభివృద్ధి కీలకమన్న మహానుభావుల మాటలను గుర్తు చేస్తూ జాతీయ సైన్స్ దినోత్సవ శుభాకాంక్షలు..

- ఫిజిక్స్ అరుణ్ కుమార్,
ప్రైవేటు టీచింగ్ ఫ్యాకల్టీ, 93947 49536









## మెటీరియల్ ఇక్కడే సరిచూసుకోవాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేసిన స్థలంలోనే సరిచూసుకోవాలని శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం ఆవరణలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఎంఎల్సీ (ఉపాధ్యాయులు) నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల పోలింగు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పోలింగ్ మెటీరియల్ అంతా అందినది లేనిది చూసుకోవాలని చెప్పారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలో రూట్ నంబర్-1లో శ్రీకాకుళం 34, శ్రీకాకుళం 35, గార 33, రూట్ నంబర్-2లో నరసన్నపేట 31, పోలాకి 32, జలుమూరు 24 ఉండగా, రూట్ నంబర్ 3లో ఆమదాలవలస 30, సరుబుజ్జిలి 25, బూర్జ 26, పొందూరు 36 ఉన్నట్లు పేర్కొన్నారు. రూట్ నంబర్-4లో ఎచ్చెర్ల 39, లావేరు 37, రణస్థలం 38, జి.సిగడాం 29 ఉన్నట్లు వివరించారు. డివిజనల్ పరిధిలో పీవో, ఏపీవో, సూక్ష్మ పరిశీలకులు కలిపి 109 పోలింగు సిబ్బంది సేవలు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. జోనల్ ఆఫీసర్లు 8 మంది, రూటు ఆఫీసర్లు 8 మంది సేవలు వినియోగిస్తున్నట్లు చెప్పారు.

• ఎడిటోరియల్

# హంతక సజ్జనులు

నలభై ఏళ్ల కిందట దేశ రాజధానిలో కాంగ్రెస్ నాయకత్వంలో నరహంతక మూకలు చేసిన హింసా బీభత్సం ఇంకా జ్ఞాపకాల్లో మెదులుతూనేవుంది. మహావృక్షం కూలినప్పుడు భూమి కంపించి తీరాలని సిక్కులను ఊచకోత కోసింది రాజకుటుంబం. మహిళల మీద అత్యాచారాలు, మెడలకు టైర్లు వేసి సజీవదహనాలు, ఆస్తులు దుకాణాల దహనాలు యథేచ్ఛగా మూడు నాలుగు రోజులు నడిపిన హెచ్‌కేఎల్ భగత్, సజ్జన్ కుమార్, జగదీష్ టైట్లర్, లలిత్ మాకెన్, ఇంకా ఎందరో అధికార కాంగ్రెస్ నాయకులు తమ రాజభక్తిని పీపాల కొద్దీ పెట్రోలు, కిరోసన్ల వితరణతో నిరూపించుకున్నారు. ఎన్నో కమిషన్లు వచ్చాయి, ఎన్నో కేసులు నడిచాయి. హింసకు నేపథ్యం అయిన ఇందిర హత్యకు బాధ్యులను మాత్రం తొందరలోనే ఉరితీశారు. కానీ 5వేల హత్యలకు ఏది న్యాయం? కొందరు దోషుల మీద సిక్కు మిలిటెంట్లు ప్రతీకారం తీర్చుకున్నారు, చిన్నస్థాయి దౌర్జన్యకారులు కొంతకాలం జైళ్లలో ఉన్నారు. చాలామంది ఏ గొడవా లేకుండా సహజమరణం పొందారు. భారత న్యాయవ్యవస్థ ఒక్క కాంగ్రెస్ బాధ్యుడినైనా ఈ కేసులో శిక్షిస్తే కనీసం ఒక సంకేతాత్మక న్యాయం జరిగినట్టవుతుందని ఎందరో ఆశించారు. సజ్జనుడు కాదు దుర్జనుడని ప్రత్యేక కోర్టులో తేలినా, ఈ తీర్పు కడదాకా నిలబడుతుందా? ఢిల్లీ హత్యాకాండలో మాదిరిగానే, గుజరాత్ నరమేధానికి కూడా ప్రతీకాత్మక న్యాయం దొరుకుతుందా, బాధ్యులైన పెద్ద మనుషుల వరుసలోని అతి చిన్నవాడినైనా ఈ వ్యవస్థ శిక్షిస్తుందా? ఇందిరాగాంధీ హత్య తర్వాత జరిగిన సిక్కులు ఊచకోతలో కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌కు ఢిల్లీ కోర్టు మంగళవారం జీవిత ఖైదు విధించింది. 1984లో జస్వంత్ సింగ్, అతని కుమారుడు తరుణ్ దీప్ సింగ్ హత్యలకు సంబంధించి ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఇంతకుముందే సజ్జన్‌ను దోషిగా ప్రకటించారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి తీర్పును వెలువరించారు. మరణశిక్ష విధించదగిన కేసులలో ఖైదీల మానసిక పరిస్థితులపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఇంతకుముందు తీర్పులు చెప్పిన నేపథ్యంలో ప్రస్తుతం కోర్టు తీహార్ జైలు అధికారుల నుంచి అటువంటి నివేదికను కోరింది. గరిష్ట శిక్ష వేయాలి దేశంలో హత్య నేరాలకు గరిష్టంగా మరణశిక్ష విధించబడుతుంది. కనిష్టంగా జీవిత ఖైదు విధిస్తారు. కుమార్‌కు గరిష్టంగా శిక్ష విధించాలని ఫిర్యాదుదారు జస్వంత్ భార్య, ప్రాసిక్యూషన్ కోర్టును కోరాయి. ప్రస్తుతం సజ్జన్ కుమార్ జైలులో ఉన్నారు. సజ్జన్ కుమార్ చేసిన హత్యలపై మొదట పంజాబీ బాగ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తును చేపట్టింది. 2021 డిసెంబర్ 16న కుమార్‌పై కేసు నమోదుకు ప్రాథమిక సాక్ష్యం ఉందని కోర్టు తెలిపింది. ప్రాసిక్యూషన్ ప్రకారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడానికి ఒక పెద్ద గుంపు మారణాయుధాలతో సిక్కుల ఆస్తులపై దాడి చేసి దోచుకోవడం ప్రారంభించింది. అలాగే దహనాలు, దాడులు ప్రారంభించింది. ఆ గుంపు ఫిర్యాదుదారు జస్వంత్ భార్య ఇంటిపై దాడి చేసి వ్యక్తులను చంపి వస్తువులను దోచుకుని వారి ఇంటికి నిప్పంటించిందని ప్రాసిక్యూషన్ పేర్కొంది. ఈ గుంపులో కుమార్ పాల్గొనడమే కాకుండా నాయకత్వం వహించాడని, దానికి సాక్ష్యాలు ఉన్నాయని కోర్టు అభిప్రాయపడిన తర్వాత విచారణ ప్రారంభం అయింది. ఇందిరాగాంధీ హత్య తర్వాత ఏర్పడిన హింస, దాని పర్యవసానాలను దర్యాప్తు చేయడానికి ఏర్పాటుచేసిన నానావతి కమిషన్ నివేదిక ప్రకారం.. ఢిల్లీలో రోజుల్లో 2,733 మంది సిక్కులు హత్యకు గురయ్యారు. దీనిపై 587 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇందులో 240 కేసులను గుర్తించబడనివిగా మూసివేయగా, మరో 250 కేసుల నిందితులను నిర్దోషులుగా విడుదల చేశారు. ఈ మొత్తం కేసులలో కేవలం 28 ఎఫ్ఐఆర్‌లకు మాత్రమే శిక్షలు పడ్డాయి. దాదాపు 400 మంది దోషులుగా నిర్ధారించారు. కుమార్‌తో సహా దాదాపు 50 మందిని హత్య కేసులో దోషులుగా నిర్ధారించారు. అల్లర్ల సమయంలో కాంగ్రెస్ నాయకుడు, ఎంపీ అయిన కుమార్ 1984 నవంబర్ 1, 2 తేదీల్లో ఢిల్లీలోని పాలం కాలనీలో ఐదుగురు వ్యక్తుల హత్యలకు సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు అతనికి జీవిత ఖైదు విధించింది. శిక్షను సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన అప్పీల్ సుప్రీంకోర్టు ముందు పెండింగ్‌లో ఉంది. ఇదే అల్లర్లకు సంబంధించి మరో కాంగ్రెస్ నేత జగదీష్ టైట్లర్‌పై నమోదయిన కేసులపై విచారణ కొనసాగుతుందని ఇంతకుముందే సుప్రీంకోర్టు ప్రకటించింది.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**- జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలు, 5035 మంది ఓటర్లు**
**- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని జిల్లాలో 5,035 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 3,416, మహిళలు 1,619 ఉన్నట్లు వివరించారు. వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వారందరికీ ఓటర్ స్లిప్పులను కూడా పంపిణీ చేయడమైనదన్నారు.



పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ ఛైర్లు సమకూర్చామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎండ వేడిమి తగలకుండా షామియానాలు, తాగు నీరు, బయోటాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ ఈనెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరగనుందన్నారు. దీనికి సంబంధించిన అన్ని రకాల ప్రక్రియలను అధికార యంత్రాంగం మొదలు పెట్టిందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని రకాల చర్యలు చేపట్టామన్నారు.

**ఎన్నికల దృష్ట్యా నిషేధాజ్ఞ ఉత్తర్వులు**

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ (ఉపాధ్యాయ) ఎన్నికల దృష్ట్యా ఈనెల 26, 27 తేదీల్లో ప్రత్యేక నిషేధ ఆంక్షలు ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. అన్ని పోలింగ్, పంపిణీ, స్వీకరణ, మధ్యంతర స్ట్రాంగ్ రూం కేంద్రాలలో జిల్లాలో ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా గుమిగూడటం, సభలు, ర్యాలీలు నిర్వహించడం వంటి వాటిని చేయకూడదన్నారు. పోలింగ్ సమయం ముగింపుకు 48 గంటలు ముందు నుంచి నిషేధాజ్ఞలు వర్తిస్తాయన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రం నుండి 200మీటర్ల పరిధిలో ఐదుగురు మించి గుమిగూడకుండా నిషేదాజ్ఞలు విధించినట్లు వివరించారు.

# మేముసైతం మెగా రక్తదాన శిబిరం



(సత్యంన్యూస్, పాలకొండ)

తమ్మినాయుడు విద్యాసంస్థలు పాలకొండ జాతీయ సేవా శిబిరం కార్యక్రమంలో భాగంగా మెగా రక్తదాన శిబి రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సీతంపేట సమగ్రగిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ యశ్వంత్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రజలకు రక్తం అవసరం చాలా ఉందన్నారు. ఈ ప్రాంతవాసులు ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతుంటారన్నారు. ఆ లోటు పూడ్చటానికి పాలకొండ ప్రభుత్వాసుపత్రి, రెడ్‌క్రాస్ శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన రోగులకు రక్తం అందించబడుతుందన్నారు. రక్తదానం చేసిన విద్యార్థినీ, విద్యార్థులను, అధ్యాపకులను, పశువైద్య సిబ్బందిని అభినందించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శివ్వాల మన్మధరావు సమక్షంలో తమ్మినాయుడు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పాలకొండ నియోజకవర్గ పశు సంవర్ధక శాఖ సిబ్బంది మొత్తం 126 మంది రక్తదానం చేశారు. జిల్లా కలెక్టర్ సూచనలు అనుసరించి నేను సైతం రక్తదాన కార్యక్రమంలో భాగంగా పాలకొండలో చేపట్టామని వైద్యులు డాక్టర్ మన్మధరావు తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.చంద్ర మౌళి, ఏడిలు డా.పి.మాణిక్యాలరావు, బి.శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.తిరుపతిరావు, జి.అశోక్ కుమార్, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎన్ సన్యాసిరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పెంకి చైతన్య కుమార్, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ చైతన్య శంకర్, డాక్టర్ సిద్దార్ధ, డాక్టర్ శంకరరావు, డాక్టర్ సంతోష్‌కుమార్, ఎన్.ఎస్.ఎస్ పిఓలు జి.సత్యనారాయణ, బి నారాయణ రావు, వి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం

ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని, ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సిఐటియు)జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పొరుగుసేవల కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తుందని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని తామంతా ఎంతో ఆశించామన్నారు. తమకు ఆశాభంగం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తారని చెప్పడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపామన్నారు. ఆప్కాస్ రద్దుచేసి తమను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల కారణంగా గతంలో అనేక సమస్యలు చవిచూశామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు అత్యవసర సేవల ద్వారా తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్విహిస్తున్నారని, వారి హక్కులను రక్షించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాల్టీలను పరిశుభ్రం చేసి, ప్రజల అవసరాలు తీర్చడమేగాక ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించడానికి తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవలు చేస్తున్నామని తెలిపారు. తమ సమస్యలు నెరవేర్చడంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయని దుయ్యబట్టారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారం, జాతీయ సెలవులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు జాతీయ సెలవులు వర్తింపజేయాలని, నగర విస్తీర్ణ పరిధి పెరిగిందని దానికనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ సమావేశంలో ఎ.గురుస్వామి, ఎ.మోహన్, డి.యుగంధర్, శంకర్ గణేష్, ఎ.జ్యోతిప్రసాద్, సూపర్ వైజర్ కె.సంతు తదితరులు పాల్గొన్నారు.







# సినిమాల్లో విలన్.. బ్రూవరీస్‌లో హీరో!

**డానీ డెంజోగ్పా.. హిందీ సినిమాలే కాదు.. తెలుగులోనూ విలన్ గా అలరించిన నటుడు. అగ్నిపథ్, క్రాంతివీర్, ఘాతక్ వంటి సినిమాల్లో ప్రభావవంతమైన పాత్రలతో బాగా పేరు తెచ్చుకున్న యాక్టర్. అంతం, రోబో వంటి పలు తెలుగు సినిమాల్లోనూ నటించిన డ్యానీ విలన్‌గా ఎంత సుపరిచితుడో.. బీర్ల వ్యాపారిగా మాత్రం చాలా మందికి అపరిచితుడు. 1987లో డానీ తన స్వస్థలమైన యుక్సమ్ పేరుతోనే.. సిక్కింలో మొట్టమొదట యుక్సమ్ బ్రూవరీస్ ప్రారంభించాడు. జస్ట్ బీర్ ఫ్యాక్టరీ నెలకొల్పడమే కాదు.. దాన్ని ఇండియాలో నంబర్ 3 పొజిషన్ కు తీసుకొచ్చిన వ్యాపారి, నేర్పరి డానీ.**

**బాలీవుడ్ స్టార్ డమ్ నుంచి బ్రూవరీస్ వ్యాపారిగా!**

1971లో జరూరత్ సినిమాతో బాలీవుడ్ రంగప్రవేశం చేసిన డానీ.. లవ్ స్టోరీ, ఖుదాగవా వంటి సినిమాల విజయాలతో మంచి పేరు సంపాదించుకున్నాడు. ఓవైపు వెండితెరపై విలన్‌గా అలరిస్తున్న సమయంలోనే దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనుకున్నాడు. అలా తాను మంచి బూమ్‌లో ఉన్న కాలంలోనే బ్రూవరీస్ వైపు అడుగులేశాడు. వ్యాపారిగా ఎదిగేందుకు 1987లో యుక్సమ్ బ్రూవరీస్ పరిశ్రమను నెలకొల్పి.. సిక్కిం స్థానిక అభిరుచులకు అనుగుణంగా బీర్లను తయారుచేశాడు. డాన్స్ బర్గ్ 16000, జూమ్, హిమాలయన్ బ్లూ వంటి 11 విభిన్న బ్రాండ్స్ తో బీర్ మార్కెట్‌లోకి ఎంటరయ్యాడు. అనతికాలంలోనే ఈశాన్యరాష్ట్రాల్లోని మార్కెట్‌ను శాసించే స్థాయికి ఎదిగాడు.

**ఆర్థిక వ్యవస్థకూ ఆలంబనగా!**

సిక్కిం వంటి ఈశాన్య రాష్ట్రంలో అక్కడి ఆర్థిక వ్యవస్థకూ యుక్సమ్ బ్రూవరీస్ తోడ్పాటైంది. సిక్కిం ఎక్స్‌ప్రెస్ 2022 నివేదిక ప్రకారం 250 మందికి ఉపాధి కల్పించడంతో పాటు, ఏటా వంద కోట్ల రూపాయల ఉత్పత్తితో ఆర్థికవ్యవస్థలో వెన్నుదన్నుగా నిల్చింది. కంపెనీ వ్యాపార నమూనా.. డానీ సంస్థ సంపద స్థిరంగా పెరగడానికీ.. అలాగే, స్థానిక సమాజానికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పనకు ఉపయోగపడింది.

**వైవిధ్యమైన రకాలతో బ్రూవరీస్ లో విజయం!**

యుక్సమ్ బ్రూవరీస్ తీసుకొచ్చిన బీర్లలో హీమ్యాన్ 9000, ఇండియా స్పెషల్ వంటి బీర్లతో స్థానికంగా మద్యంబాబుల అభిరుచికనుగుణంగా మార్కెట్‌లోకి విస్తరించింది. ధరల్లో కూడా ఇతర బ్రాండ్స్‌తో పోలిస్తే కాస్త అందుబాటులో ఉండటం కూడా డానీ వ్యాపార విస్తరణకు మరింత కలిసివచ్చింది. 6 లక్షల 80 వేల హెక్టోలీటర్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో యూక్సమ్ బ్రూవరీస్ భారతీయ బీర్ కంపెనీల్లో మూడో స్థానంలో నిల్చింది. యుక్సమ్ కంటే ముందు ఉన్నవాటిలో నంబర్ వన్‌గా కింగ్‌ఫిషర్, రెండో స్థానంలో కిమయ బీర్లు నిల్చాయి. అయితే, ఓవైపు బ్రూవరీస్ వ్యాపారం ఇంతింతై పెరుగుతూ తీరికలేని సమయంలో కూడా.. డానీ, నటనపై మాత్రం తన ఆసక్తిని కోల్పోలేదు. సినిమాతో సంబంధాన్ని మాత్రం కొనసాగిస్తూ వచ్చాడు. తను బాగా బిజీ ఉన్న సమయంలో కూడా థ్రిల్లర్ మూవీస్ నామ్ షబానా, బేబీ వంటి సినిమాల్లోనూ నటించాడు. డానీ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఓవైపు నటుడిగా, ఇంకో వైపు వ్యాపారిగా కొనసాగుతూనే.. కిషోర్ కుమార్, లతా మంగేష్కర్ వంటి వారితో కలిసి పాటలు కూడా పాడాడు. బ్రాడ్‌పిట్‌తో కలిసి సెవెన్ ఈయర్స్ ఇన్ టిబెట్ వంటి హాలీవుడ్ సినిమాల్లోనూ నటించాడు. తన ఊరంటే ఉన్న మమకారంతో తన ఊరు పేరే బ్రూవరీస్‌కు యుక్సమ్‌గా నామకరణం చేసిన డానీ జర్నీ క్వైట్ ఇంట్రెస్టింగ్. దృఢసంకల్పం, వ్యూహాత్మక దృష్టి ఉంటేగనుక బహుళ రంగాల్లో ఎలా రాణించవచ్చో డానీ ప్రయాణం మనకు చెబుతుంది.

ఈశాన్య మార్కెట్ లో ఆధిపత్యం, విస్తరణ!

2005లో డానీ ఒడిశాలో డెంజాంగ్ బ్రూవరీస్‌ను స్థాపించాడు. అలా తన కార్యకలాపాలను విస్తరించాడు. 2009 నాటికి ఈశాన్య బీర్ మార్కెట్ ను తన యుక్సమ్ బ్రూవరీస్ వైపు పూర్తిగా ఆకర్షించి లాభదాయక వ్యాపారంగా మార్చేశాడు. అప్పటికే భారతదేశంలో విజయమాల్యా యునైటెడ్ బ్రూవరీస్ హవా నడుస్తున్న రోజులవి. అస్సాంలోని రైనో ఏజన్సీని కూడా కొనుగోలు చేసి.. ఈశాన్య మార్కెట్ లోకి కూడా విజయ్ మాల్యా ప్రవేశించాలని ప్రయత్నించాడు. కానీ, సినిమాల్లో అప్పటికే తెలివైన విలన్ గా నటిస్తున్న డానీ అంతకుముందే ఆ విషయాన్ని తెలుసుకుని విజయ్ మాల్యా ఒప్పందాల కంటే ముందే అప్రమత్తమయ్యాడు. తానే రైనో ఏజెన్సీని కొని ఈశాన్య రాష్ట్రాల్లో యునైటెడ్ బ్రూవరీస్ అడుగు పెట్టకుండా చేసి నిజ జీవితంలోనూ తన విలనీ చేష్టలతో బీర్ మార్కెట్‌లో రారాజైనాడు. విలన్ కాస్తా ఏకఛత్రాధిపత్యం సాగించే హీరో అయిపోయి కూర్చున్నాడు.

దాంతో ఈశాన్య రాష్ట్రాల్లో డానీ యుక్సమ్ బ్రూవరీస్ ఓ తిరుగులేని శక్తిగా ఎదిగింది. యుక్సమ్ బీర్స్ స్థానాన్ని సుస్థిరం చేసింది. బీర్ల పరిశ్రమలో తనకెదురెవ్వరూ పోటీలో లేకుండా చేసింది.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

# యానిమల్‌ని విమర్శించి హీరోని పొగిడారు.. నా సంగతేంటి?



రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో సందీప్ వంగా తెరకెక్కించిన యానిమల్ సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. రణబీర్ కెరీర్ బెస్ట్ హిట్ చిత్రాన్ని తెలుగు దర్శకుడు సందీప్ వంగా అందించారు. అయితే యానిమల్ సినిమాపై చాలా విమర్శలు వచ్చాయి. సినిమాలో రక్తపాతం హింసను విమర్శించారు. చాలామంది దర్శకుడిని టార్గెట్ చేసారు. ముఖ్యంగా రణబీర్‌కి ఇంత పెద్ద హిట్టిచ్చిన సందీప్ ని బాలీవుడ్ లోని కొందరు ప్రత్యేకంగా టార్గెట్ చేయడం చర్చకు వచ్చింది. ఇప్పుడు దర్శకుడు సందీప్ వంగా టోకున అందరికీ తనదైన స్టైల్లో ఇచ్చారు. చిత్ర పరిశ్రమ యానిమల్‌ను విమర్శించి, రణ్‌బీర్ కపూర్‌ను ఎలా ప్రశంసించిందో గుర్తుచేసుకుంటూ బాలీవుడ్‌లో ఉన్న అసమానతను సందీప్ రెడ్డి వంగా ప్రశ్నించారు. యానిమల్ సినిమాను విమర్శించారు.. కానీ రణబీర్‌ని పొగిడారు. నాకు రణబీర్‌పై అసూయ లేదు, కానీ నాకు ఆ అసమానత అర్థం కాలేదు. వారు (పరిశ్రమలోని వ్యక్తులు) రణబీర్‌తో కలిసి పనిచేయాలని కోరుకుంటున్నారని నేను అర్థం చేసుకున్నాను. పరిశ్రమకు నేను కొత్త. నాపై కామెంట్లు చేయడం సులభం. విమర్శించడం సులువు. ఒక ఫిలిం మేకర్ ప్రతి 2-3 సంవత్సరాలకు ఒక సినిమా చేస్తాడు.. కానీ ఒక నటుడు సంవత్సరానికి ఐదుసార్లు సినిమాల్లో కనిపిస్తాడు. స్టార్లు ఎవరితో కలిసి పని చేస్తారో ఎక్కువగా చెప్పరు.. అని అన్నారు. బాలీవుడ్‌లో తనను బయటి వ్యక్తిగా భావిస్తున్నారా? అని ప్రశ్నించగా, సందీప్ వంగా అలాంటిదేమీ లేదన్నారు. నేను లోపలి వ్యక్తి.. బయటి వ్యక్తి అనేవి నమ్మను. నేను ఎప్పుడూ బయటి వ్యక్తిగా భావించలేదు. నేను ఇప్పటికే చెప్పినట్లుగా ముఠాతత్వం, అసమానత ఉన్నాయి. అయితే ఇలాంటి పాఠశాలకు కొత్త వ్యక్తి వచ్చినప్పుడు ఇలాగే జరుగుతుందని నేను భావిస్తున్నాను. మీరు కిండర్ గార్టెన్ నుండి అక్కడ చదువుతున్నారు. ఎవరైనా కొత్త వ్యక్తి 10వ తరగతిలో చేరినప్పుడు మీరు సీనియారిటీ ఫీలవుతారు కదా! ఇదీ అలాంటిదేనని అన్నారు. కబీర్ సింగ్‌లో తనతో కలిసి పనిచేసిన ఒక నటుడికి ఒక ప్రధాన బాలీవుడ్ నిర్మాణ సంస్థ ఎలా అవకాశం ఇవ్వలేదో కూడా సందీప్ వంగా చెప్పాడు. ఈ పక్షపాతానికి పరిశ్రమను విమర్శించాడు. రణబీర్ కపూర్, త్రిప్తి దిమ్రీ, రష్మిక మందన్న విషయం లోను అలాగే చేయమని ఆ నిర్మాణ సంస్థకు సవాల్ విసిరాడు. సందీప్ వంగా తన నిరాశను వ్యక్తం చేస్తూ, పరిస్థితి చూసి తాను చిరాకు పడ్డానని, బాధపడ్డానని చెప్పాడు. యానిమల్ ఒక యాక్షన్-డ్రామా. హింస, స్త్రీ ద్వేషపూరిత సన్నివేశాల కారణంగా విమర్శలను ఎదుర్కొంది. జావేద్ అక్తర్, కంగనా రనౌత్ వంటి ప్రముఖులు ఈ చిత్రాన్ని బహిరంగంగా విమర్శించారు. అయితే ఎవరు ఎలా విమర్శించినా కానీ, యానిమల్ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. ప్రపంచవ్యాప్తంగా 900 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ చిత్రం ఒక శక్తివంతమైన పారిశ్రామికవేత్త కుమారుడు రణ్‌విజయ్ సింగ్ కథను.. అతడి తండ్రితో సమస్యాత్మక సంబంధాన్ని తెరపై సందీప్ వంగా అద్భుతంగా ఆవిష్కరించారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..

## శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎంజీఆర్



(సత్యంన్యూస్, జలుమూరు)

మహాశివరాత్రి శుభసందర్భంగా శ్రీముఖలింగం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీముఖలింగేశ్వర స్వామి వారిని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావును స్థానిక పురోహితులు వేద మంత్రాలతో ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారుజ అనంతరం స్వామివారి దర్శనం కలుగజేసి శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. ఆయనతోపాటు పాతపట్నం మండల అధ్యక్షులు పైల బాబ్జి, శ్రీరామ్ రమణ, శివాల చిన్నయ్య, మండల నాయకులున్నారు.

## ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి

(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

మండలంలోని భరణికోట పంచాయతీకి చెందిన శ్రీశ్రీశ్రీ కాటమ కోటిలింగేశ్వర స్వామిదేవాలయంనకు దాతలు సహకరించవలసిందిగా భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు నెమలిపురి రవికుమార్ కోరారు. శివరాత్రి మహోత్సవం, ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా భరణి కోటలో శివుని పూజలు అందుకున్న భాజపా మండల ప్రెసిడెంట్‌కు అక్కడ కూటమి నాయకులు, నంది వాహన సేవా సంఘ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. తమ శివాలయం దాతలతో, శ్రమతో నిర్మించబడిందన్నారు. దీనికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. అయితే మా శివాలయానికి నీటిబోరు, ప్రహరీ గోడ నిర్మాణం తదితర పనులు పెండింగ్లో ఉన్నందున దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే శ్రీశ్రీశ్రీ అమ్మవారి ఆలయ నిర్మాణానికి కూడా పనులు మొదలు పెట్టాలని వారు నిర్ణయించుకున్నారు. కాబట్టి తన వంతు బాధ్యతగా సహకారం చేయ గలిగిన ప్రతి ఒక్కరు సహకరించవలసిందిగా భాజపా మండల అధ్యక్షులు నెమలిపురి రవికుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు దుంపల తారకేశ్వరరావు, ఎస్.ధర్మరాజు, ఎస్.గోపాల్, ఎస్.జ్వరాడుతో పాటు నంది వాహన సంఘ సభ్యులు కళ్యాణ్, పంతులు తదితరులు పాల్గొన్నారు.



# చక్రతీర్థ స్నానాలకు పటిష్టమైన భద్రత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహాశివరాత్రి పర్వదినాన సందర్భంగా శ్రీ ముఖలింగంలో జరుగుతున్న శ్రీముఖలింగేశ్వర స్వామీ శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి కుటుంబ సభ్యులు, ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి బుధవారం శ్రీముఖలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సామాన్య భక్తులు ప్రశాంతంగా స్వామివారి దర్శనం చేసుకునేలా అవకాశం కల్పించి, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు లేకుండా, ప్రశాంతంగా జరిగేందుకు ఆలయంలోపల, పరిసరాలను సందర్శించి క్యూలైన్లు నిర్వహణ, భక్తులు దర్శనం చేసుకునే విధానం, భద్రతా పరమైన చర్యలను డీఐజీ గోపీనాథ్ జట్టి, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిలు స్వయంగా పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలో అన్ని వైపులా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని, చక్ర తీర్థ స్నానాలకు భారీసంఖ్యలో భక్తులు దర్శనం కోసం వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి చక్రతీర్థ స్నానాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని డీఐజీ గోపీనాథ్ జట్టి అధికారులకు సూచించారు.

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించవలసిన విధులు గురించి ఎస్పీ మహేశ్వరరెడ్డి బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు ముఖ్యమైన అంశాలపై సూచనలు చేసి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు.

అనంతరం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈనెల 28న ఉదయం జరగనున్న శ్రీ ముఖలింగేశ్వరస్వామివారి చక్రతీర్థ స్నానాలు నేపథ్యంలో ఆలయం నుంచి బయలుదేరి సోమవారం విగ్రహాలు స్నానాలు జరిపించే వంశధార నది పరివాహక ప్రాంతాన్ని కాలినడక ద్వారా సందర్శించి మార్గమధ్యంలో తీసుకోవలసిన భద్రత, బందోబస్తు ఏర్పాట్లు, నదీ పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న బారికేడ్లు, భక్తుల నియంత్రణ, ప్రశాంతంగా చక్రతీర్థ స్నానాలు జరిగేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అధికారులతో జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా, జలుమూరు మండలంలో నేటినుండి మూడు రోజులపాటు జరగనున్న శ్రీముఖలింగేశ్వర ఆలయంలోని స్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాలు, శుక్రవారం జరుగునున్న చక్ర తీర్థ స్నానాలు బందోబస్తు భద్రతాపరమైన అంశాలపై విశాఖపట్నం రేంజ్ డీఐజి గోపినాథ్ జట్టితో కలిసి బుధవారం పరిశీలించామన్నారు. శుక్రవారం జరిగే చక్రతీర్థ స్నానాలకు సుమారు ఒక లక్ష పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్న అంచనా మేరకు ఆ విధంగా బందోబస్తు, భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. భక్తులంతా ప్రశాంతంగా స్వామి వారి దర్శనం, స్నానాలు ఆచరించే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇందు నిమిత్తం సుమారు 950 మంది స్పెషల్ పార్టీ ఫోర్సు, రోప్‌పార్టీ, లాఅండ్‌ఆర్డర్ అధికారులు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీసు, రెవిన్యూ, ఆలయ అధికారులు సమన్వయంతో ప్రత్యేక కార్యచరణ రూపొందించడం జరిగిందన్నారు. ఉత్సవ విగ్రహాలు చక్రతీర్థ స్నానాలకు వెళ్లి మార్గం సుమారు రెండు కిలోమీటర్ల మేరకు ఇరువైపుల భారీకెడ్లు,పటిష్ట బందోబస్తు తోపాటు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల పర్యవేక్షణలో ప్రశాంతంగా ఉత్సవం జరిపేందుకు అన్ని విధాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదే విధంగా స్వామివారి దర్శనం నిమిత్తం వచ్చే భక్తులు, ప్రజలు సహాయ సహకారాలు అందించి ప్రశాంతంగా చక్రతీర్థ స్నానాలు జరిపేందుకు జిల్లా



పోలీసు యంత్రాంగానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ కోరారు. ఆయన వెంట ఎఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి, సి.హెచ్.వివేకానంద్, ఇతర పోలీసు అధికారాలు, రెవెన్యూ, ఆలయ అధికారులు ఉన్నారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221



మహా శివరాత్రి సందర్భంగా జ్యోతిర్లింగ క్షేత్రం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ మహాకాళేశ్వర్ స్వామివారిని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు బుధవారం దర్శించుకున్నారు. **– సత్యంన్యూస్, శ్రీకాకుళం**



నిత్యఅన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో 394వ రోజు ఆమదాలవలస మున్సిపాలిటీ, కొత్త కందరపేటకు చెందిన గోటివాడ శ్రావణి పుట్టినరోజు సందర్భంగా అత్త పోలమ్మ, భర్త సింహాచలం వారు 35 మందికి అన్నసంతర్పణ, మిఠాయిలు పంచిపెట్టారు.

**– సత్యంన్యూస్, ఆమదాలవలస**

## రాములవారిని దర్శించుకున్న ఎంపీ

(సత్యంన్యూస్, నెల్లిమర్ల)

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి రామతీర్థంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయినా శ్రీరాములవారి ఆలయాన్ని, శివాలయంను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగిన సూచనలు, సలహాలు జారీ చేశారు. అదే విధంగా భక్తులు సౌకర్యార్థం చేసిన దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం శ్రీరామ భగవంతుడిని, పరమేశ్వరుడిని కుటుంబ సమేతంగా దర్శించుకుని శివ నామస్మరంతో భక్తులందరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో కలకాలం వాళ్ళ కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉండాలని భక్తులందరిపై శ్రీరామరక్ష, పరమేశ్వరుడు ఆశీస్సులు ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.





మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నరసన్నపేట సంతలో గల శ్రీ మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో, అలాగే దక్షిణ కాశీగా పేరొందిన శ్రీముఖలింగంలో మధుకేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైకాపా యువ నాయకులు, పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్యతోపాటు నాలుగు మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **– సత్యంన్యూస్, నరసన్నపేట.**

## ఘనంగా కైలాశేశ్వర స్వామివారి వార్షికోత్సవ వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం రూరల్ మండలం కిష్టప్ప పేట గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ పార్వతి సమేత కైలాశేశ్వర స్వామి వారి 22వ వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ వ్యవస్థాపకులు ధర్మకర్త గొండు జగన్నాధరావు దంపతులు శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ స్వాతి దంపతులు, మీనాక్షి హాస్పిటల్ అధినేత గొండు గంగాధర్ హరిత దంపతుల ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఇసురుగుండు, సంగిడి, తీత సంగిడి, బంపర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్‌కి నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో మూడు విభాగాల్లో బహుమతులు ప్రధానం చేశారు ఇసురుడు గుండు ఫస్ట్ ప్రైజ్ గేదల సత్యనారాయణ సెకండ్ ప్రైస్ గేదల రమణ థర్డ్ ప్రైస్ ఆవాలు సత్యనారాయణ తీతసంగిడి ఫస్ట్ ప్రైస్ గేదల సత్యనారాయణ సెకండ్ ప్రైస్ ఆవాల సత్యనారాయణ థర్డ్ ప్రైస్ గేదల రమణ బంపర్స్ ఫస్ట్ ప్రైస్ ఆవాల గోవిందా సెకండ్ ప్రైస్ గుజ్జల ట్వింకిల్, థర్డ్ ప్రైస్ పి నాగరాజు బంపర్స్ లేడీస్ ఫస్ట్ ప్రైస్ రాజ్యలక్ష్మి హేమశ్రీ థర్డ్ ప్రైస్ కావ్య ఈడుపు సంగడి ఫస్ట్ ప్రైస్ ఆవాలి గోవిందా సెకండ్ ప్రైజ్ గేదల వసంతరావులు గెలుపొందారు. పల్లె క్రీడలకు ప్రతిబింబించే విధంగా ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ధర్మకర్త గొండు జగన్నాధరావు తెలిపారు. పోటీల అనంతరం బహుమతులు ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో వేకువ జామునుంచే మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని, స్వామి వారి ని దర్శించుకోవాలని కోరారు.



## మార్పు బాలకృష్ణమ్మపై వ్యక్తిగత విమర్శలు తగదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సందర్భంగా ఏపీటీఎఫ్ (257) రాష్ట్ర నాయకుడు పాండురంగ వరప్రసాద్ పూర్వపు ఎమ్మెల్సీ, ఏపీటీఎఫ్ (1938) వ్యవస్థాపకులు మార్పు బాలకృష్ణమ్మ పై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని డీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కోత ధర్మారావు, జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ క్రిష్ణారావులు సూచించారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యమంలో పనిచేసి, అమరులైన నాయకులపై వారి మరణానంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రయోజనాల కోసం చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- పీఎం సూర్య ఘర్ మిషన్ మోడ్ లో చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజా సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్‌తో కలసి రెవెన్యూ, ఉపాధి హామీ పథకం, ప్రధాన మంత్రి సూర్యఘర్, ఐసిడిఎస్, జిఎస్డబ్ల్యుఎస్, పారిశుద్ధ్యం, వైద్య ఆరోగ్యం, పిజిఆర్ఎస్ వంటి అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సవరించిన విచారణ నివేదిక, ఎండార్స్‌మెంట్ ప్రొఫార్మాలను పరిశీలించారు. పరిష్కరించబడిన ఫిర్యాదులపై ఆడిటింగ్ నిర్వహించాలని, ఏపీ సేవ, మీసేవా, పిజిఆర్ఎస్ దరఖాస్తుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి సాంకేతికతను ఉపయోగించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనను మిషన్ మోడ్‌లో చేపట్టాలని ఎంపీడిఓలు, విద్యుత్ శాఖ ఏఈలకు సూచించారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే, ఫిర్యాదులను పరిష్కరించడానికి అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. ఐవిఆర్ ఎస్ కాల్‌ల విశ్లేషణ, గృహ స్థలాల రీ వెరిఫికేషన్, అభ్యంతరం లేని ఆక్రమణల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, లోకాయుక్త కేసులు, ఎస్సీఎస్టీ కేసుల పరిష్కారంలపై అంశాల వారిగా మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏఈలు, డీఈల స్థాయిలో పల్లె పండుగ పనుల స్థితి, గత ప్రభుత్వ హయాంలో మంజూరై ఇప్పుడు పురోగతిలో ఉన్న పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయడంపై చర్చించారు. ఐసిడిఎస్‌లో మరుగుదొడ్లు, విద్యుత్, నీటి సరఫరా స్థితిపై సమీక్షించారు. గ్రామ సచివాలయాలకు సంబంధించి గత సమావేశంలో చర్చించిన హాజరు, ఇతర సర్వేల స్థితిపై అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యంపై సమీక్షలో భాగంగా చెత్త నుంచి సంపద సృష్టి ప్లాంట్ల గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్య ప్రణాళికా అధికారి కార్యాలయం పరిధిలో ముఖ్యమంత్రి హామీలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ప్రత్యేక ఉపకలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీవో ప్రసన్నలక్ష్మి, డిపీవో భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాధ స్వామి, డిఆర్డిఏ పీడి కిరణ్ కుమార్, హౌసింగ్ పీడి నగేష్, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్ తదితరులు హాజరయ్యారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001



# అసెంబ్లీలో ఆ ఒక్కరోజు సంతకాన్ని హాజరుగా పరిగణించరా..

# అనర్హత వేటు పడుతుందా?

**మా**జీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షుడు, ఆ పార్టీ శాసన సభాపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ హాజరు విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన కేవలం మూడుసార్లు మాత్రమే అసెంబ్లీకి హాజరయ్యారు. 2024 జూన్‌లో అసెంబ్లీ కొలువుదీరగా, తొలిరోజు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి, వెంటనే వెళ్లిపోయారు. అదే ఏడాది, జూలైలో జరిగిన సమావేశాల తొలిరోజు గవర్నర్ ప్రసంగం మధ్యలోనే నిష్క్రమించారు. తాజాగా 2025 ఫిబ్రవరి 24న ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం మొదలుపెట్టిన పది నిమిషాలకే వైఎస్ జగన్ వెళ్లిపోయారు.

**సభలోకి వెళ్లే ముందే..**

అక్కడ ఎమ్మెల్యేలు సంతకాలు పెట్టేందుకు ఏర్పాటుచేసిన రిజిస్టర్‌లో జగన్ సంతకం చేసి సభలోకి ప్రవేశించారు. గవర్నర్ ప్రసంగిస్తుండగానే ప్రతిపక్ష హోదా కోసం పట్టుబడుతూ వైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు చేస్తూ సభలో నిరసనకు దిగారు. ఆ తర్వాత, వైకాపా సభ్యులు అందరినీ తోడ్కొని జగన్ సభ నుంచి వాకౌట్ చేశారు. వాస్తవానికి, తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకుంటే శాసనసభకు వచ్చినా ప్రయోజనం లేదంటూ గత ఏడాది నవంబర్‌లో జరిగిన సమావేశాలను ఆయన బహిష్కరించారు. 'అసెంబ్లీ సమావేశాల సమయంలో మీడియా ముందుకొచ్చి మాట్లాడతాం. మీడియా సమక్షంలోనే ప్రతిపక్షంలా వ్యవహరిస్తూ చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీస్తాం' అని మీడియా సమావేశంలో జగన్ చెప్పారు. అయితే, వరుసగా 60 రోజుల పాటు అసెంబ్లీకి హాజరుకాకుంటే అనర్హత వేటు పడుతుందంటూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఇటీవల పలుమార్లు వివిధ సందర్భాల్లో చెబుతూ వచ్చారు. అందుకే, జగన్ సోమవారం అసెంబ్లీకి వచ్చి హాజరు వేయించుకుని వెళ్లారంటూ టీడీపీ నేతలు విమర్శించారు. ఆ తర్వాత ఇప్పుడు, మరో కొత్త వాదన తెరపైకి వచ్చింది. గవర్నర్ ప్రసంగం రోజున వస్తే అది అసెంబ్లీకి హాజరుగా పరిగణించరనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. దీనిపై కూడా టీడీపీ, వైకాపా పక్షాలు భిన్నవాదనలు వినిపిస్తున్నాయి.

**అది సెషన్ కాదు.. హాజరుగా పరిగణించరు**

యనమల 'ఉభయసభలను ఉద్దేశించి అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం, లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగం సెషన్స్ కిందకు రావు. వాటికి సభ్యులు వచ్చినా హాజరుగా పరిగణించలేరు' అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు గతంలో స్పీకర్‌గా పనిచేసిన మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. 'గవర్నర్ ప్రసంగం రోజున కూడా సంతకం తీసుకుంటారు కానీ, అది సెషన్స్‌కి హాజరుగా లెక్కలోకి తీసుకోరు' అని ఆయన వివరించారు. 'వైఎస్ జగన్ సహా వైకాపా సభ్యులు సోమవారం సంతకాలు పెట్టినా, అవి హాజరు కిందకు రాదు. మంగళవారం నుంచి జరిగే సభకు వచ్చుంటే దాన్ని మాత్రమే కచ్చితంగా హాజరు లేదా సిటింగ్ లెక్కలోకి తీసుకుంటారు' అని యనమల చెప్పారు. 'సరైన కారణాలు లేకుండా వరుసగా 60 రోజులు అసెంబ్లీకి హాజరుకాకుంటే అనర్హత వేటు వేసే అవకాశం శాసన సభాపతికి ఉంటుంది. కానీ, ఒకవిధంగా చెప్పాలంటే ఇది అంత సులువైన ప్రక్రియ కాదు' అన్నారు. 'సభ్యుడు అలా 60 రోజులు కంటిన్యూగా రాకుంటే సెలవు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ సెలవుకు కూడా సహేతుకమైన కారణాలు చెప్పాలి. తీవ్రమైన అనారోగ్యం, లేదంటే అత్యవసర పరిస్థితి కారణాలుగా చూపి సెలవుకు దరఖాస్తు చేయాలి. ఆ సెలవు లేఖను స్పీకర్‌కు లేదంటే శాసనసభ కార్యదర్శికి అందజేయాలి. ఆ విషయాన్ని సభలో ప్రవేశపెట్టాలి. లీడర్ ఆఫ్ హౌస్ అనుమతివ్వాలి, ఆ తర్వాత స్పీకర్ అనర్హత వేటుపై ప్రకటన చేయాలి' అని వివరించారు యనమల. అయితే, యనమల వాదనలతో గత వైకాపా ప్రభుత్వ సమయంలో అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన కోన రఘుపతి విభేదించారు.

**అది హాజరు కిందకే వస్తుంది**

కోన రఘుపతి 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సహా 11 మంది వైకాపా సభ్యులు సోమవారం నాటి గవర్నర్ ప్రసంగ సమావేశానికి వెళ్లడం హాజరు కిందకే వస్తుంది. అలా కాకుంటే సంతకం రిజిస్టర్ ఎందుకు పెట్టినట్టు? మా సభ్యులు సంతకం పెట్టేశారు, అటెండెన్సే లెక్క. అదే ప్రామాణికం. అక్కడితో అయిపోయింది.' అని గత ప్రభుత్వ హయాంలో డిప్యూటీ స్పీకర్‌గా పని చేసిన కోన రఘుపతి బీబీసీతో అన్నారు. 'మీరు సెషన్స్ పెడతారా.. గవర్నర్ ప్రసంగం పెడతారా? అనేది సంబంధం లేదు. సభ్యుడు సభకి వచ్చి సంతకం పెట్టి వెళ్లారంటే హాజరైనట్టే' అని ఆయన అన్నారు. 'అసలు వాస్తవంగా చెప్పాలంటే, 60 రోజులు వరుసగా రాకుంటే సదరు సభ్యుడిపై అనర్హత వేటు వేయాలనే నిబంధనపైనే ఎక్కడా క్లారిటీ లేదు. సభ్యులు క్రమం తప్పకుండా రావాలనే ఉద్దేశంతో పెట్టిన నిబంధనే కానీ, ఇన్ని రోజులు రాకుంటే అనర్హత వేటు వేయాలనేదానిపై ఎక్కడా స్పష్టత లేదు. చాలా వెసులుబాట్లు ఉంటాయి' అని రఘుపతి చెప్పారు. అలాగే, మొత్తం శాసన సభ సభ్యుల్లో పది శాతం మంది ఎమ్మెల్యేలు ఉంటేనే ప్రతిపక్ష హోదా ఇవ్వాలనేది కూడా కచ్చితమైన నిబంధన ఏమీ కాదని ఆయన అన్నారు. ఇదే విషయమై, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను బీబీసీ సంప్రదించగా, తర్వాత మాట్లాడతానని ఆయన చెప్పారు.

**ఆర్టికల్ 190(4) ఏం చెబుతోంది?**

అసెంబ్లీ లేదా పార్లమెంటు సభ్యుడిని అనర్హుడిగా ప్రకటించేందుకు రాజ్యాంగం కొన్ని నిబంధనలు విధించింది. వాటిలో ద్వంద్వ సభ్యత్వంతో పాటు ఒక సభ్యుడు స్పీకర్ అనుమతి లేకుండా 60 రోజుల పాటు సభకు హాజరుకాకపోతే అనర్హుడిగా ప్రకటించవచ్చని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 190(4) కింద ఒక రాష్ట్ర శాసన సభలోని సభ్యుడు 60 రోజుల పాటు సభ అనుమతి లేకుండా అన్ని సమావేశాలకు గైర్హాజరైతే, సభ ఆ ప్రతినిధి సీటు ఖాళీ అయినట్టు ప్రకటించవచ్చని చెబుతోంది. కానీ, ఆ 60 రోజుల కాలాన్ని లెక్కించేటప్పుడు సభ వరుసగా నాలుగు రోజులకు మించి వాయిదా పడిన కాలాన్ని, ప్రోరోగ్ అయిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోకూడదని తెలియజేసింది.

సభ అనుమతి లేకుండా 60 రోజులు వరుసగా సభకు గైర్హాజరైతే ఆ సీటు ఖాళీ అయినట్టు ప్రకటించవచ్చని ఆర్టికల్ 190(4) చెబుతోంది. అసెంబ్లీ వర్గాలు ఏమంటున్నాయంటే.. '60 రోజులు వరుసగా హాజరుకాకుంటే సదరు సభ్యుడిపై అనర్హత వేటు వేయడమనే విషయం పూర్తిగా స్పీకర్ విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది' అని తన పేరు మీడియాలో రాయడానికి ఇష్టపడని ఏపీ శాసనసభ కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారి తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 208(1) ప్రకారం రూపొందించుకున్న శాసనసభ విధివిధానాల మేరకు, 2007 మార్చి 30న శాసన మండలి పునర్నిర్మాణం సందర్భంగా చేసిన సవరణలను కూడా ఈ సందర్భంగా ఉదహరించవచ్చని ఆయన పేర్కొన్నారు. రూల్ 187లో పేర్కొన్న ఏపీ శాసన సభ విధాన నియమాల ప్రకారం.. సభలో సభ్యుల ఆమోదంతో, అసెంబ్లీ ఏకీభవించి నిర్ణయం తీసుకోవచ్చని



చెప్పారు. అనర్హత, హాజరు అంశాలపై శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌తో మాట్లాడేందుకు బీబీసీ ప్రయత్నించింది. అయితే, ఆయన అందుబాటులోకి రాలేదు. మంత్రి అందుబాటులోకి వస్తే, ఆయన చెప్పిన వివరాలు ఈ కథనానికి జోడిస్తాం.

సభ్యుడిపై అనర్హత వేటు చాలా పెద్ద వ్యవహారమని సీనియర్ న్యాయవాది చెప్పారు. అదంత సులువు కాదు.. అయితే, ఒక సభ్యుడిపై అనర్హత వేటు వేయడం అంత సులువు కాదన్నారు. 'వరుసగా 60 రోజులు సభకు రాని సభ్యుడి సభ్యత్వం రద్దు చేయవచ్చని చట్టంలో ఉంది. సభకు రాకపోతే ముందస్తు అనుమతి తీసుకోవాలి. కానీ, అది తీవ్ర అనారోగ్యం, అత్యవసర పరిస్థితులకు మాత్రమే వర్తిస్తుంది.' 'కానీ, నిజంగా ఒక సభ్యుడిని అలా తొలగించాలంటే చాలా పెద్ద కాంప్లెక్స్ వ్యవహారం ఉంది. చాలా కష్టమైన ప్రక్రియ అది. పైగా, అసలు అన్ని రోజులు సభ జరగడం కూడా పెద్ద విషయం' అని ఆయన చెప్పారు. 'ఈ తీరు సరికాదు' 'అసెంబ్లీ సమావేశాలను ఇప్పుడు జగన్ బహిష్కరించడం.. గతంలో ఏ కారణాలతోనైనా, చంద్రబాబు బహిష్కరించడం సరైన పద్ధతి కాదు.. ఈ పోకడలు ప్రజాస్వామ్య పతనానికి నాంది. ప్రజా తీర్పును శిరసావహించాలి కదా' అని సీనియర్ జర్నలిస్ట్ గాలి నాగరాజు అభిప్రాయపడ్డారు. 'ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక సభలకు గైర్హాజరు కావడం, అనర్హత వేటు పడుతుందనే భయంతో లాంఛనంగా వెళ్లిరావడం, ఏ పార్టీ వాళ్లైనా.. ఈ విధానం సరికాదు' అన్నారాయన. 'బయట చేసే నిరసనకు, చట్టసభల్లో వ్యక్తం చేసే నిరసనకు తేడా ఉంటుంది' అని నాగరాజు అన్నారు.

- గరికిపాటి ఉమాకాంత్, బీబీసీ సౌజన్యంతో..

# గుడిలో లింగాన్నే దోచేశారు



**గుజరాత్:** పెద్దలు చెప్పే సామేతలు అప్పుడప్పుడు మనకు ఏదో ఒక సందర్భంలో గుర్తొస్తుంటాయి. అలాంటిదే 'గుడితో పాటు గుడిలోని లింగాన్నీ మింగేసే రకం' అనేది. దీన్ని కొంతమంది మోసగాళ్లను ఉద్దేశిస్తూ చెప్పే సామెత. అదేదో సామెత.. అసలు శివలింగాన్ని ఎవరు మాయం చేస్తారులే అని సాధారణంగా అనుకుంటుంటాం. కానీ నిజానికి ఇప్పుడు అలాంటి ఘటనే జరిగింది. అది కూడా శివరాత్రికి ముందురోజు, ప్రధాని నరేంద్ర మోదీ స్వరాష్ట్రంలో. ఈ ఘటనకు సంబంధించిన వార్త ఇప్పుడు వైరల్‌గా మారింది.

గుజరాత్ రాష్ట్రం ద్వారక జిల్లాలో అరేబియా సముద్రం ఒడ్డున శ్రీ భిద్భంజన్ భవానీశ్వర్ మహాదేవ్ ఆలయం ఉంది. పురాతన ఆలయం కావడం, సముద్రం ఒడ్డున ఉండడంతో అక్కడికి భక్తులు రోజూ పెద్దఎత్తున వస్తుంటారు. మహాదేవుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అనంతరం సముద్ర తీరాన సేద తీరుతుంటారు. అయితే శివరాత్రి సందర్భంగా ఆలయ అధికారులు మంగళవారం పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని శుద్ధి చేసి స్వామివారిని అలంకరించారు. అనంతరం గుడికి తాళాలు వేసి వెళ్లిపోయారు. శివరాత్రి సందర్భంగా పూజలు చేసేందుకు బుధవారం తెల్లవారు జామున పూజారి సహా భక్తులు పెద్దఎత్తున ఆలయం వద్దకు వెళ్లారు. అయితే అక్కడ కనిపించిన దృశ్యాలు వారంతా అవాక్కయ్యారు.

ఆలయానికి వెళ్లిన పూజారి తలుపులు తీసి గర్భగుడిలోకి వెళ్లారు. అక్కడ శివలింగం లేకపోవడంతో షాక్‌కు గురయ్యారు. పూజారితో పాటు భక్తులూ దిగ్భ్రాంతికి లోనయ్యారు. కాగా, అర్ధరాత్రి వేళ ఆలయం లోపలికి ప్రవేశించిన దుండగులు శివలింగాన్ని దొంగిలించారు. శివ లింగాన్ని పెకలించి ఎత్తుకెళ్లారు. అప్రమత్తమైన పూజారి సమాచారాన్ని వెంటనే దేవదాయశాఖ అధికారులు, పోలీసులకు అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఆలయ అధికారులు స్కూబా డ్రైవర్ల సహాయంతో సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. దొంగిలించిన శివుడి ప్రతిమను నీటిలో పడేశారా? లేక పడవగుండా ఎక్కడికైనా తరలించారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

కాగా, భారతదేశానికి చెందిన అనేక పురాతన, విలువైన విగ్రహాలు తరచూ చోరీలకు గురవుతున్నాయి. వాటిని దొంగిలిస్తున్న కేటుగాళ్లు విదేశాలకు లక్షలు, కోట్లకు అమ్మేస్తున్నారు. ఏళ్ల తర్వాత ఈ విగ్రహాలు ఇతర దేశాల్లో ప్రత్యక్షమవుతున్నాయి. వాటిని గుర్తించి తిరిగి తీసుకువచ్చేందుకు అధికారులు నానా తిప్పలూ పడుతున్నారు. అయితే విగ్రహాలు చోరీలకు గురవకుండా చర్యలు తీసుకోవడంతో ప్రభుత్వాలు, పురావస్తు శాఖ అధికారులు విఫలం అవుతున్నారని పలువురు విమర్శలు చేస్తున్నారు.

# 'రాజ'కీయం.. 'స్థాని'కుల్ని తినేస్తుంది..!

(మొదటిపేజీ తరువాయి)

అందించకూడదని నిర్ణయించుకున్నారు. మొబైల్‌లు విప్లవం మొలకెత్తిన రోజుల్లో ఈ స్పేర్లు, యాక్సెసరీస్‌ను ఉత్తరభారతదేశానికి చెందిన కొందరు ముస్లింలు దక్షిణ భారతదేశంలో చేపట్టేవారు. ఎప్పుడైతే ఈ రంగంలోకి రాజస్థానీలు వచ్చారో, అప్పుడు వీటి ధరలు తగ్గినమాట వాస్తవం. అయితే ఇప్పుడు ఇవి మరింత చవగ్గా దొరుకుతున్నా ఇంకా పాత రేట్లకే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో మార్వాడీలు, గుజరాతీలు అంటే పానీపూరీ బండి, పావుబాజీ బండి మాత్రమే మనకు కనిపిస్తుంది. కానీ జిల్లాలో చడీచప్పుడు లేకుండా అనేక వ్యాపారాల్లో వీరు గుత్తాధిపత్యం సాధించారు. బ్యాంగిల్స్, ఫ్యాన్సీ ఐటమ్స్‌లో ఇప్పుడు వీరిదే అగ్రభాగం. మొబైల్ యాక్సెసరీస్‌లో వీరి తర్వాతే ఎవరైనా. టూవీలర్ స్పేర్స్‌లో వీరే ముందున్నారు. ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్‌లో కూడా జిల్లా వ్యాపారులను వీరు ఎప్పుడో తొక్కుకుంటూపోయారు. మూడేళ్ల క్రితం జిల్లాలో మొబైల్ స్పేర్లు అమ్మడానికి వచ్చిన ఒక వ్యాపారి ఈ అతి తక్కువ కాలంలోనే స్థానిక రామకృష్ణ థియేటర్ సందులో మూడు కోట్ల విలువైన భవనాన్ని నిర్మించుకున్నారు. ఇప్పటికే మొబైల్ మెకానిక్ యూనియన్ అనేకమార్లు సమావేశమైంది. కానీ ఇందులో రాజస్థానీ వ్యాపారులు మాత్రం పాల్గోలేదు. హోల్‌సేల్ ధరలను కేవలం షాపులకే ఇవ్వాలని, మిగిలిన వారికి రిటైల్‌గా అమ్మాలన్న ప్రతిపాదనను వారసలు అంగీకరించడంలేదు. ఇప్పుడు సెల్ రిపేర్‌షాప్ కూడా వీరే పెట్టేస్తే జిల్లాలో అనేకులు ఉపాధి కోల్పోతారని, వేలకు వేలు అద్దెలు చెల్లిస్తున్న స్థానికులు రోడ్డున పడిపోతారని చెబుతున్నా రాజస్థానీలు మాత్రం తమ దారికి రాకపోతే వ్యాపారాలు చేయనీయమని ప్రతిజ్ఞ పూడినట్లు చెబుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా యువతకు స్వయం ఉపాధి కల్పించడం కోసం ప్రభుత్వం శిక్షణ, రుణాలు కూడా ఇస్తోంది. ఇప్పుడు వీరంతా పనులు లేకుండాపోతామన్న ఆందోళనతో ఒకవైపు యూనియన్‌తో ఉంటూనే, మరోవైపు రాజస్థానీలు చెప్పినదానికి ఊకొడుతున్నారట.






# మెటీరియల్ అంతా సరిచూసుకోవాలి



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఎన్నికల మెటీరియల్ అంతా సరిచూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ తెలిపారు. శ్రీకాకుళం ఆర్డీవో కార్యాలయం ఆవరణలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఎంఎల్సీ (ఉపాధ్యాయులు) నియోజకవర్గానికి సంబంధించి ఆర్డీవో కార్యాలయం వద్ద ఎన్నికల పోలింగు మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్ తీసుకున్న పోలింగు అధికారులను మెటీరియల్ అంతా తీసుకున్నారా లేదా అని ఒక్కొక్క మెటీరియల్‌ను అడిగి చూపించమని కలెక్టర్ అడుగగా పోలింగు అధికారులు ఒక్కో మెటీరియల్‌ను కలెక్టర్‌కు చూపించారు. ఎన్నికల విధులకు ఏర్పాటుచేసిన సిబ్బంది అంతా హాజరయ్యారా లేదాని ఆర్డీవో కార్యాలయ సిబ్బందిని అడుగగా ఆర్డీవో కె.సాయి ప్రత్యూష మాట్లాడుతూ ఇద్దరు మాత్రం ఆరోగ్య సమస్యలపై విధులకు హాజరు కాలేకపోయినట్లు వివరించారు. ఎన్నికల విధులకు ఎవరైనా హాజరు కాకపోతే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. మెటీరియల్ తీసుకొని మధ్యాహ్నం ఇక్కడే భోజనాలు చేసి పోలింగు కేంద్రాలకు బయలుదేరాలని చెప్పారు. పోలీసు సిబ్బంది వద్దకు వెళ్లి ఎవరెవరికి ఎక్కడ డ్యూటీలు వేశారో పోలీసులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం ఇక్కడే భోజనాలు చేసి ఇక్కడి నుంచే పోలింగు కేంద్రాలకు బయలుదేరాలని, పోలింగ్ అనంతరం రిసెప్షన్ కౌంటర్ల వద్దే పోలింగు బాక్సులు అందజేయాల్సి ఉంటుందన్నారు. మూడు డివిజన్లలో పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేసిన స్థలంలోనే తిరిగి రిసెప్షన్ కౌంటర్లు వద్ద పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు అందజేయాలని చెప్పారు. అంతా పరిశీలన చేసి రిసెప్షన్ కౌంటర్ వద్ద బ్యాలెట్ బాక్సులు అందజేయాలని చెప్పారు. అనంతరం శ్రీకాకుళం నుంచి పోలింగు బాక్సులను విశాఖపట్నం తరలిస్తామన్నారు. ఆరుగురు పోలింగు సిబ్బంది నియమించినట్లు తెలిపారు. రూటుకి ఒక సెక్టార్ ఆఫీసర్, ఒక జోనల్ ఆఫీసర్ ఉంటారని, వీరికి పోలింగు కేంద్రాలకు వెళ్లేందుకు ఒక ఆర్టీసి బస్సులో పగడ్బందీగా పోలీసు బందోబస్తుతో పోలింగు కేంద్రాలకు చేరుకుంటారన్నారు. టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్లలో చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహించే తీరును పోలింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ ఎన్నికల అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, ఎలక్షన్ డిటీలు తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.